సాక్షి
అనంతపురం
ఆదివారం । 24 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



టమాట కిలో రూ.30

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.23 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.1°/12.9°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

11 మందికి ఏఎస్‌ఐలుగా పదోన్నతి

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న 11 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఎస్పీ పి. జగదీష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి తీసుకుని బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్. మధుసూదన్ రావు (శ్రీ సత్యసాయి జిల్లా),జి. నాగరాజు (గుంతకల్లు రూరల్ నుంచి పామిడి), ఆర్. ఉదయభాస్కర రాజు (శ్రీ సత్యసాయి జిల్లా), వై. తిమ్మరాజు (శింగనమల నుంచి బ్రహ్మసముద్రం), ఎస్. మల్లి రెడ్డి (అనంతపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి గార్లదిన్నె), ఎం. సత్యనారాయణ (శ్రీ సత్యసాయి జిల్లా), ఎస్. ఓబులేసు (అనంతపురం వన్‌టౌన్ నుంచి విడపనకల్లు), ఈ. వెంకట రాముడు (శ్రీ సత్యసాయి జిల్లా), ఎం. బాబు నాయక్ (ఆత్మకూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లా), ఎం. బాబయ్య (గుంతకల్లు రూరల్ నుంచి శ్రీ సత్యసాయి జిల్లా), జి. రమేష్ (విడపనకల్లు నుంచి శ్రీ సత్యసాయి జిల్లా).

రేపు 'దుర్గం'లో జిల్లాస్థాయి గ్రీవెన్స్

అనంతపురం అర్బన్: కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రజాసమస్యల జిల్లాస్థాయి పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను ఈనెల 25న సోమవారం కళ్యాణదుర్గంలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ ఇన్‌చార్జ్ వాణిశ్రీ శనివారం తెలిపారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీతో పాటు ఆధార్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

నేటి నుంచి ఉద్యోగుల క్రికెట్ టోర్నీ

అనంతపురం: ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ–2024 ప్రారంభించనున్నట్లు వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఎంట్రీలు ఇచ్చిన ప్రతి జట్టు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. నాకౌట్ పద్ధతిలో సెలవు దినాల్లో మాత్రమే మ్యాచ్‌లు జరుగుతాయన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ

అనంతపురం అర్బన్: వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే క్రమంలో డెలివరీ బాయ్స్ అధిక చార్జీలు వసూలు చేయడం చట్టరీత్యా నేరమని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అన్నారు. అలా చేస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేర తీవ్రతను బట్టి ఏజెన్సీ లైసెన్స్ రద్దు చేస్తామని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జేసీ శనివారం నగర పరిధిలోని ఎర్రనేల కొట్టాలు (ఎంజీకాలనీ) ప్రాంతంలో పర్యటించి దీపం పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ సక్రమంగా సరఫరా చేస్తున్నారా అధిక చార్జీలు ఏమైనా వసూలు చేశారా? అని ఆరా తీశారు. గ్యాస్ సరఫరా విషయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ సర్క్యులర్ జారీ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో దీపం–2 పథకం కింద ఇప్పటి వరకు 1,10,942 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.8,92,06,369 జమయ్యిందన్నారు. ఏఎస్‌ఓ జగన్, తదితరులున్నారు.

ప్రమాదం జరిగిందిలా.. (ప్రతీకాత్మక చిత్రం)



మాటలకందని విషాదం

వారంతా నిరుపేదలు. బిడ్డల భవిష్యత్తు కోసం పరితపించేవారు. తమ కష్టం పిల్లలకు రాకూడదంటూ బాగా కష్టపడేవారు. నిత్యం కూలి పనులకు వెళ్తూ పొట్ట నింపుకునేవారు. పనులకెళ్తూనే వారిలో కొందరు తమ బిడ్డలను ఉన్నత చదువులు చదివించారు. అలా రోజూలానే కూలి పనులకెళ్లి తిరిగి తమ గ్రామానికి బయలుదేరిన వారిపై మృత్యువు పంజా విసిరింది. బస్సు రూపంలో ప్రాణాల్ని మింగేసింది. అయినవారికి తీరని శోకం మిగిల్చింది.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సును పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

- రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది కూలీల మృత్యువాత
- ఐదుగురికి గాయాలు
- మృతులంతా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు
- శోకసంద్రంలో 'ఎల్లుట్ల'
- గుండెలవిసేలా రోదించిన కుటుంబీకులు



ఘటనా స్థలిలో మృతదేహాలు, ఆటో

గార్లదిన్నె/పుట్లూరు/అనంతపురం మెడికల్: గార్లదిన్నె సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది కూలీలు దుర్మరణం చెందడం,మరో ఐదుగురు తీవ్రంగా గాయపడడంతో జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. వీరంతా పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన వారు. పైగా అందరిదీ ఒకే సామాజిక వర్గం. గార్లదిన్నె మండలం తిమ్మంపేట వద్ద అరటి తోటలో పనులు పూర్తి చేసుకుని గ్రామానికి తిరిగి వెళుతూ ప్రమాదానికి గురయ్యారు.

మిన్నంటిన ఆర్తనాదాలు

సర్వజనాస్పత్రిలో క్షతగాత్రులు, బాధిత కుటుంబీకుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ప్రమాద వార్త తెలుసుకున్న ఎల్లుట్ల గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి తరలివచ్చారు. మృతులతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీరు పెట్టుకున్నారు. విగత జీవులుగా పడి ఉన్న తమ వారిని చూసి కుటుంబీకులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు. మృతుల కుటుంబీకులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బంధువులు, గ్రామస్తులు ఆస్పత్రి క్యాజువాలిటీ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా: కలెక్టర్

మృతుల కుటుంబీకులకు ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎస్పీ జగదీష్‌తో కలిసి క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. ఒకేసారి ఎనిమిది మంది కూలీలు మరణించడం బాధాకరమన్నారు. తీవ్రంగా గాయపడిన గంగాధర్, రామాంజినమ్మ, నీలకంఠ, పెద్దులమ్మ, లక్ష్మీదేవిని మెరుగైన చికిత్స కోసం కిమ్స్–సవీర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, ఆస్పత్రిలో క్షతగాత్రులను మంత్రి సవిత పరామర్శించారు.

ఎస్పీ దిగ్భ్రాంతి..

ఘోర రోడ్డు ప్రమాదంపై ఎస్పీ జగదీష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డు ప్రమాదంపై ఆరా తీశారు.

మృతులు

బాలపెద్దయ్య అలియాస్ తాతయ్య (55), చిన్న నాగమ్మ (48), డి.రామాంజినమ్మ (47), పెద్ద నాగమ్మ (60), చిన్ననాగన్న (55), జయరాముడు(48), కొండమ్మ(50),ఈశ్వరయ్య (55)

క్షతగాత్రులు

లక్ష్మీదేవి, పెద్దులమ్మ, బి.రామాంజినమ్మ, గంగాధర్, ఆటో డ్రైవర్ నీలకంఠ.



మృతులు చిన్న నాగమ్మ, చిన్న నాగన్న దంపతులు



మృతి చెందిన కొండమ్మ, ఈశ్వరయ్య దంపతులు

బిడ్డ కాన్పు ఖర్చులకు డబ్బు అవసరమని..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్న నాగన్న, చిన్న నాగమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా పెద్ద కుమార్తె శాంతి నిండు గర్భిణి. రెండో కుమార్తె స్పందన డిగ్రీ చదువుతోంది. కుమార్తె కాన్పు ఖర్చుల కోసం డబ్బు అవసరం కావడంతో దంపతులిద్దరూ కూలి పనులకెళ్లేవారు. దూరమైనా ఎక్కువ కూలి వస్తుందని భావించి శనివారం వేరే ఊరికి ఆటోలో వెళ్లారు. ఈ క్రమంలోనే జరిగిన ప్రమాదంలో నాగన్న, నాగమ్మలు ప్రాణాలు వదలడంతో బిడ్డలు గుండెలవిసేలా రోదించారు.

కూలి పనులతోనే బిడ్డలకు వివాహం..



మృతురాలు నాగమ్మ

ఎల్లుట్ల గ్రామానికి చెందిన డి.నాగమ్మ, పుల్లయ్య దంపతులు. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా కూలి పనులకు వెళ్తూ అలా వచ్చిన డబ్బులతోనే అందరికీ పెళ్లిళ్లు చేశారు. ఇప్పటికీ పుల్లయ్య ట్రాక్టర్ పనులకు వెళ్తుండగా, నాగమ్మ వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ బిడ్డలకు చేదోడువాదోడుగా ఉండేవారు. ఈ క్రమంలోనే మృత్యువు నాగమ్మను తీసుకెళ్లడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదే ప్రమాదంలో మృతురాలు కోడలు లక్ష్మీదేవికి తీవ్రగాయాలయ్యాయి.

ద్వాక్రా రుణం చెల్లించడం కోసం..



తాతయ్య అలియాస్ బాలపెద్దయ్య

బాలపెద్దయ్య అలియాస్ తాతయ్య, పెద్దులమ్మ దంపతులకు కూలి పనులే ఆధారం. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్దులమ్మ డ్వాక్రాలో సభ్యురాలిగా ఉంటూ రుణం తీసుకోవడంతో ఆ రుణం కంతులు చెల్లించడం కోసం దంపతులు రోజూ కూలి పనులకు వెళ్లేవారు. గ్రామంలో పనులు తక్కువగా ఉండటంతో దూరమైనా భార్యాభర్తలు వెళ్లారు. రోడ్డు ప్రమాదంలో బాలపెద్దయ్య మృతి చెందగా, పెద్దులమ్మ తీవ్రంగా గాయపడింది.

మృత్యువులోనూ వీడని బంధం

అన్యోన్యంగా ఉండే కొండమ్మ, ఈశ్వరయ్య దంపతులను రోడ్డు ప్రమాదం కబళించింది. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం కాగా ఇద్దరినీ ఉన్నత చదువులు చదివించారు. కుమారుడు హర్షవర్ధన్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తుండగా, కుమార్తె టీటీసీ పూర్తి చేసింది. తోటి కూలీలు పిలవడంతో ఆటో ఎక్కిన కొండమ్మ, ఈశ్వరయ్యలు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆస్పత్రిలో ముందు కొండమ్మ ప్రాణాలు విడవగా, కొద్దిసేపటికే ఈశ్వరయ్య కూడా మృతి చెందాడు.

బిడ్డలకు మన కష్టం వద్దంటూ..



మృతి చెందిన జయరాముడు

'కొడుకు, కూతురును బాగా చదివించాల.. మన కష్టం వారు పడవద్దు' అంటూ నిత్యం బిడ్డల భవిష్యత్తు కోసం తపించేవాడు జయరాముడు. పిల్లలను ఉన్నతంగా చదివించాలని భార్య జయమ్మతో తరచూ చెప్పేవాడు. ఈ క్రమంలోనే రోడ్డు ప్రమాదం రూపంలో జయరాముడు మృతి చెందటంతో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. ఇక తమకు దిక్కెవరంటూ వారు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

కుమారుడిని ఉద్యోగంలో చూడకనే..



మృతురాలు రామాంజినమ్మ

తన కొడుకు బీటెక్ చదువు పూర్తి చేశాడని, వాడికి ఉద్యోగం వస్తే కష్టాలు తీరుతాయని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డి. రామాంజినమ్మ తోటి కూలీలతో తరచూ చెప్పేది. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. బిడ్డల చదువు కోసం రామాంజినమ్మ, కుళ్లాయప్ప దంపతులు చాలా కష్టపడేవారు. అరటి తోటలో పని ఉందని చెప్పడంతో గ్రామం నుంచి మొదటి సారి బయటి ప్రాంతాలకు వెళ్లి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిందని గ్రామస్తులు కన్నీళ్లు పెట్టుకున్నారు.







క్షతగాత్రుల బంధువులతో నిండిపోయిన సర్వజనాస్పత్రి, గాయపడిన మహిళతో మాట్లాడుతున్న మంత్రి సవిత, రోదిస్తున్న మృతుల బంధువులు

రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

అనంతపురం అర్బన్: గార్లదిన్నె మండలం తలగాచిపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది కూలీలు మరణించడం బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, మూడు ఎకరాలు భూమి ఇవ్వాలన్నారు.



సర్వజనాస్పత్రి మార్చురీ వద్ద గుమిగూడిన ఎల్లుట్ల గ్రామస్తులు



పరిహారం చెల్లించాలంటూ సర్వజనాస్పత్రిలో ధర్నా చేస్తున్న మృతుల కుటుంబీకులు, బంధువులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ప్రభుత్వం కళ్లు తెరవాలి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో పనులు లేక గ్రామాలు విడిచి వలస వెళ్లే దయనీయమైన పరిస్థితి ఏర్పడిందని, ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరచి పేద ప్రజలకు పనులు కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గార్లదిన్నె వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని మార్చురీ వద్ద ఆయన పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించారు. సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులతో మాట్లాడి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ పల్లెల్లో పనులు లేక ప్రజలు ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తోందన్నారు. పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన కూలీలు పనుల కోసం 50 నుంచి వంద కిలో మీటర్లు ప్రయాణం చేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చన్నారు. అలా వెళ్లిన ఎనిమిది మంది మృత్యువాత పడడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులు, గాయపడ్డవారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

'నర్సాపురం' భూముల ధరలపై నివేదిక ఇవ్వండి

అనంతపరం అర్బన్: బెళుగుప్ప మండలం నర్సాపురం పరిధిలో రైల్వే స్టేషన్ నిర్మించనున్న నేపథ్యంలో రైతుల నుంచి భూములు సేకరించనున్నందున ఆ గ్రామంలో ఏడాది కాలంలో జరిగిన క్రయవిక్రయాలను పరిశీలించి పక్కా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రైల్వే స్టేషన్‌కు భూ సేకరణ అంశంపై కలెక్టర్ శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి అధికారులతో సమీక్షించారు. రైల్వే స్టేషన్ నిర్మాణానికి నర్సాపురంలో సర్వే నంబరు 177లో 9.92 ఎకరాలు, సర్వే నంబరు 178లో 8.95 ఎకరాలు మొత్తం 17.97 ఎకరాలను 17 మంది రైతుల నుంచి సేకరించాల్సి ఉందన్నారు. ఇక్కడ ప్రభుత్వం నిర్ణయించిన ధర ఎకరాకు రూ.6.25 లక్షలు అని తెలిపారు. అయితే బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.30 లక్షల నుంచి రూ.33 లక్షల వరకు ధర ఉందని, ఆ ప్రకారమే తమకు ఇవ్వాలని రైతులు కోరుతున్నారన్నారు. కావున గ్రామ పరిధిలో ఏడాది కాలంలో జరిగిన భూముల క్రయవిక్రయాలపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ ధర కంటే ఎక్కువకు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉంటే ఆధారాలతో నివేదిక సమర్పించాలని చెప్పారు. గ్రామ పరిధిలో భూ క్రయవిక్రయాలు జరిగి ఉండకపోతే... సమీప గ్రామాల్లో జరిగిన క్రయవిక్రయాల వివరాలు ఇవ్వాలన్నారు. గ్రామస్థాయిలో వీఆర్‌ఓ, తహసీల్దారు, మండల సబ్ రిజిస్ట్రార్ సంయుక్తంగా పరిశీలించి నివేదికలను జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపించాలన్నారు. జిల్లా రిజిస్ట్రార్ దానిని డీఎల్‌ఎస్‌సీ సమావేశంలో సమర్పిస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు వాటికి ఆమోదిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత బాబు, రైల్వే శాఖ ఈఈ జగదీష్‌సాయి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివనారాయణశర్మ

క్లుప్తంగా

దేశ సేవలో ఎన్‌సీసీ ప్రముఖ పాత్ర



ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న క్యాడెట్లు

అనంతపురం: దేశభక్తి గల పౌరులను తీర్చిదిద్దడంలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ కులకర్ణి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ఎన్‌సీసీ 76వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు కెమికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కెప్టెన్ డాక్టర్ శారద, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ గొల్లా పిన్ని సీతారామశాస్త్రి (రిటైర్డ్ ఇంగ్లిష్ లెక్చరర్) ముఖ్య అతిథిగా హాజరై ఎన్‌సీసీ ఏర్పాటు లక్ష్యాలు, సాధించిన అంశాలపై ప్రసంగించారు. సుబేదార్ మేజర్ బల్బీర్ సింగ్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి



మరుగుదొడ్ల సర్వేలో భాగంగా స్థానికులతో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజునాయుడు

ఆత్మకూరు: ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి అని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజునాయుడు తెలిపారు. మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించేందుకు సర్వే జరుగుతోందన్నారు. శనివారం ప్రపంచ టాయిలెట్ దినోత్సవ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరులో ఆయన మండల అధికారులతో కలసి పర్యటించారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 10 వరకు ఈ ప్రచార కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ మరుగుదొడ్డి కట్టుకోవడం, వాటి వాడకం, వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని వారిని సర్వే చేయాలని అధికారులకు సూచించారు. మరుగుదొడ్లు లేని వారి నుంచి దరఖాస్తులు తీసుకుని వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడా అపరిశుభ్రత కనిపించరాదని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, సర్పంచ్ వరలక్ష్మి, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఈఓఆర్‌డీ కామాక్షి, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

సాయినామం.. భక్తపరవశం

- ఘనంగా సత్యసాయి 99వ జయంతి వేడుకలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- వేడుకల్లో పాల్గొన్న వేలాది మంది సత్యసాయి భక్తులు, ప్రముఖులు
- సత్యసాయిని స్మరించుకుని పులకించిన భక్త కోటి
- దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ



సత్యసాయి మహాసమాధికి పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఆధ్యాత్మిక పురి పుట్టపర్తి సత్యసాయి నామంతో పరవశించిపోయింది. సత్యసాయి 99వ జయంత్యుత్సవాల సందర్భంగా ప్రశాంతి నిలయంలో ఎటు చూసినా సత్యసాయి స్వరూపమే కనిపించింది. ఎవరి నోట విన్నా 'సాయిరాం' అన్న నామమే వినిపించింది. సత్యనామంతోపురవీధులు ప్రతిధ్వనించగా.. భక్తకోటి పరవశించింది.

ప్రశాంతి నిలయం: సత్యసాయి 99వ జయంతి వేడుకలు ప్రశాంతి నిలయంలో శనివారం వైభవంగా జరిగాయి. ఉదయం వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు సత్యసాయికి హృదయ నివేదనను అర్పిస్తూ గురువందనం నిర్వహించారు. చక్కటి భక్తిగీతాలతో సత్యసాయిని కీర్తిస్తూ బాబాకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్యసాయి ట్రస్ట్ సభ్యుడు నాగానంద ప్రారంభోపన్యాసం చేశారు.

సత్యసాయి ఖ్యాతి ఖండాంతరాలకు చాటేలా శతజయంతి ఉత్సవాలు

సత్యసాయి తన ప్రేమతత్వంతో భక్తకోటిని ఆదరించారని, ఆయన చూపిన మార్గం మానవాళికి సన్మార్గమని సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్య అన్నారు. సత్యసాయి ఖ్యాతి ఖండాంతరాలకు చాటేలా శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం ఇప్పటి నుంచే సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. శతజయంతి వేడుకల్లో భాగంగా సత్యసాయి అవతార ప్రకటన చేసిన ఉరవకొండ నుంచి రథోత్సవం ప్రారంభించి దేశవ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. జాతీయ స్థాయిలో సత్యసాయి బోధించిన మానవతా విలువలకు నిదర్శనంగా ఆరు కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడించారు. దేశంలోని రుత్వికులందరినీ ఆహ్వానించి ప్రశాంతి నిలయంలో 2025 ఫిబ్రవరిలో అతిరుద్ర మహా యజ్ఞం చేపడతామన్నారు. 'సాయికల్పతరు' కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇప్పటికే 14 లక్షల పైచిలుకు మొక్కలు నాటామన్నారు. 2025 నవంబర్ 23న జరిగే శతజయంతి ఉత్సవాలు విజయవంతం చేసేందుకు సత్యసాయి భక్తులంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, సవిత, సత్యసాయి సెంట్రస్ట్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ మోహన్, చక్రవర్తి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్ రాజు, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎస్పీ వి.రత్న తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలు ప్రపంచానికి ఆదర్శం

నిస్వార్థ సేవలు, ఆధ్యాత్మిక బోధనలతో సత్యసాయి మానవాళిని సన్మార్గం వైపు పయనింపజేసేందుకు కృషి చేశారని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. జయంత్యుత్సవాల్లో ఆయన మాట్లాడుతూ, 'మానవ సేవే మాధవ సేవ' అని బోధించిన సత్యసాయి... మానవాళిని సేవా మార్గం వైపు నడిపారన్నారు. మానవత్వమే అందరి మతం కావాలన్న సందేశంతో మానవాళిని ఏకం చేసేందుకు కృషి చేశారన్నారు. 120 దేశాల్లో సత్యసాయి సేవా సంస్థల ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలతో ఎందరో అభాగ్యులకు మేలు జరుగుతోందన్నారు. సత్యసాయి ఆశయ సాధనలో భాగంగా ట్రస్ట్ చేపట్టిన కార్యక్రమాలు ఎంతో గొప్పవన్నారు.

ప్రశాంతి నిలయం.. భక్తజన సంద్రం

బాబా జయంత్యుత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి, విదేశాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ప్రశాంత నిలయం భక్తజన సంద్రమైంది. పట్టణంలోని చిత్రావతిరోడ్డు, సమాధి రోడ్డు, ప్రశాంతి నిలయంలో వీధులన్నీ కిటకిటలాడాయి. 'ఓం సాయిరాం' అంటూ సత్యసాయి నామాన్ని స్మరిస్తూ భక్తులు తన్మయత్వం చెందారు. ఉచిత భోజన కౌంటర్ల వద్ద కూడా భారీ రద్దీ కనిపించింది. దర్శనీయ స్థలాలైన ప్లానిటోరియం, కల్పవృక్షం, మ్యూజియం, చైతన్యజ్యోతి మ్యూజియం, శివలింగ మందిరం, సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తదితర ప్రదేశాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు వివిధ కూడళ్లలో తాగునీరు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

సత్యసాయికి జోలోత్సవం

సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయికి జోలోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ఊపుతూ భక్తిగీతాలు ఆలపించారు. జోలా సేవలో భక్తులు మైమరచిపోయారు.

అలరించిన కచేరీ

శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో లాల్‌గుడి జీజేఆర్ కృష్ణ బృందం, మల్లాది సోదరుల బృందం సంగీత కచేరీ నిర్వహించింది. లాల్‌గుడి బీజేఆర్ కృష్ణ బృందం వయోలిన్ వాయిద్య కచేరీతో భక్తులు మైమరచిపోయారు. మల్లాడి సోదరుల సంగీత కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది.

కృత్రిమ అవయవాలు పంపిణీ

దివ్యాంగుల్లో మనోధైర్యాన్ని నింపేందుకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సత్యసాయి 'దివ్యాంగజన్' కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు గవర్నర్ చేతుల మీదుగా ఎంపిక చేసిన 250 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను అందజేశారు.





సత్యసాయి జయంతి వేడుకల్లో ప్రారంభోపన్యాసం చేస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు నాగానంద, వేడుకలలో పాల్గొన్న భక్తులు



స్వర్ణ రథోత్సవంలో పాల్గొన్న ఆర్.జె.రత్నాకర్ తదితరులు

స్వర్ణ రథోత్సవం.. తరించిన భక్తజనం

సత్యసాయి 99వ జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ప్రశాంతి నిలయంలో సత్యసాయి స్వర్ణ రథోత్సవం కమనీయంగా సాగింది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ బృందం సభ్యులు స్వర్ణ రథంపై సత్యసాయి చిత్రపటాన్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. భక్తుల జయజయ ధ్వానాలు పలకగా, రథోత్సవం ప్రశాంతి నిలయం పురవీధుల్లో సాగింది. భక్తులు రథం ముందు సత్యసాయిని కీర్తిస్తూ గానామృతాన్ని పంచారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొని తరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధి చెంత బంగారు రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాన్ని ముగించారు.

ట్రస్ట్ ఆదాయం రూ.237 కోట్లు

సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులతో కలిసి గవర్నర్ అబ్దుల్ నజీర్ ట్రస్ట్ వార్షిక నివేదికను విడుదల చేశారు. ట్రస్ట్‌కు విరాళాలు, పెట్టుబడుల రూపంలో గత ఏడాది రూ.237 కోట్ల ఆదాయం వచ్చినట్లు సత్యసాయి ట్రస్ట్ సభ్యుడు ఎస్ఎస్ నాగానంద తెలిపారు. అందులో రెవెన్యూ వ్యయం రూ.166 కోట్లు, మూలధన వ్యయం రూ.32 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించారు. ఆరోగ్య సేవల కోసం రూ.100 కోట్లు, విద్యారంగానికి రూ.15 కోట్లు, సత్యసాయి సంస్థల్లో వివిధ అభివృద్ధి పనులకు రూ.20 కోట్లు, ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలు కోసం మరో రూ.28 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. సత్యసాయి ఆశయ సాధనకు ట్రస్ట్ నిరంతర కృషి చేస్తోందని నాగానంద తెలిపారు. సత్యసాయి సేవలను విస్తరించేందుకు ట్రస్ట్ అహర్నిశలు పనిచేస్తోందన్నారు. అలాగే సత్యసాయి ట్రస్ట్ సభ్యులుగా టీటీడీ భగవత్ స్థానంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐఎస్ఎన్ ప్రసాద్‌తో పాటు సుప్రీం కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి రామసుబ్రహ్మణ్యంను సెంట్రల్ ట్రస్ట్ సభ్యులుగా నియమించినట్లు వెల్లడించారు. పుట్టపర్తి ప్రశాంతి గ్రాం, వైట్ ఫీల్డ్‌లలోని రెండు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ద్వారా గత ఏడాది 16,500 శస్త్ర చికిత్స చేశామన్నారు. అలాగే 2,15,000 మంది అవుట్ పేషెంట్లకు సేవలు, అత్యాధునిక ల్యాబ్‌ల ద్వారా 23,0000 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. పుట్టపర్తి, వైట్‌ఫీల్డ్‌లలోని జనరల్ ఆస్పత్రుల ద్వారా 1.30 లక్షల మంది అవుట్ పేషెంట్లకు సేవలు అందించామని, 3,800 శస్త్ర చికిత్సలు చేసినట్లు వెల్లడించారు. సత్యసాయి మొబైల్ వైద్య సేవల ద్వారా 56,000 మందికి, టెలీ మెడిసిన్ ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాల వారికీ సేవలు అందిస్తున్నామన్నారు. అలాగే రాజమహేంద్రవరం, పుట్టపర్తి కేంద్రంగా నిర్వహిస్తున్న విద్యాసంస్థల ద్వారా 4,678 మంది విద్యార్థులకు ఉచిత విద్యనందిస్తున్నామన్నారు. వీటితో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలను సెంట్రల్ ట్రస్ట్ నిర్వహిస్తోందన్నారు.

విధుల్లో చేరుతున్న ఎంపీఈఓలు

అనంతపురం అగ్రికల్చర్: డిప్యుటేషన్ మీద చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు బదిలీ అయిన మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ (ఎంపీఈఓలు) తిరిగి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు కేటాయించడంతో వారందరూ విధుల్లో చేరుతున్నారు. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా గతంలో చిత్తూరుకు వెళ్లిన ఎంపీఈఓల డిప్యుటేషన్లను రద్దు చేస్తూ ఇటీవల కమిషనరేట్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో చిత్తూరు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ఎంపీఈఓలను రిలీవ్ చేస్తున్నారు. డిప్యుటేషన్ మీద వెళ్లిన 105 మందిలో అనంతపురం జిల్లాకు 50 మందిని, శ్రీసత్యసాయి జిల్లాకు 55 మందిని కేటాయించారు. రిలీవ్ అయి వచ్చిన చాలామంది ఎంపీఈఓలు శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు.

ఫస్ట్ కమ్ ఫస్ట్ అనే విధానంలో ఇక్కడ ఖాళీగా ఉన్న స్థానాలకు ఎంపిక చేసుకునే అవకాశం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే ఇక్కడి అధికారులు కొందరు తమ వాళ్లకు ముందుగానే కొన్ని స్థానాలను రిజర్వ్ చేసుకున్నట్లు చెబుతున్నారు. క్లియర్ వేకెన్సీలకు సంబంధించి జాబితా అందుబాటులో పెట్టకపోవడంతో స్థానాల ఎంపిక కొందరు ఎంపీఈఓలకు ఇబ్బందిగా మారింది. సిఫారసులు, తమ నచ్చిన ఎంపీఈఓలకు మాత్రం వారు కోరుకున్న ప్రాంతాలు, ఆర్‌ఎస్‌కేలు ఇస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ కారణాలతో దీర్ఘకాలిక సెలవు పెట్టిన వాళ్లు, టెర్మినేట్ అయిన వాళ్లు, చెప్పాపెట్టకుండా వెళ్లిన (అబ్‌స్కాండ్) ఎంపీఈఓల పరిస్థితి ఇపుడు అగమ్య గోచరంగా మారింది.

రెండు వాహనాల ఢీ

- హంద్రీ-నీవా కాలువలోకి ఎగిరిపడ్డ దంపతులు
- నీట మునిగి భార్య మృతి
- ప్రాణాలతో బయటపడ్డ భర్త



మాణిక్యమ్మ (ఫైల్)

ఉరవకొండ: దైవ దర్శనం కోసం బయల్దేరిన దంపతులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న వీరిని ఎదురుగా వచ్చిన మరో గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాలువలోకి ఎగిరిపడిన దంపతుల్లో భార్య నీట మునిగి మృతి చెందింది. భర్త అతికష్టం మీద ఈదుకుంటూ బయటకు వచ్చి ప్రాణాలు దక్కించుకున్నాడు. పెద్దకొకుంట్ల గ్రామ సమీపంలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రాయంపల్లికి చెందిన లాలుస్వామి, మాణిక్యమ్మ (52) దంపతులు వై.రాంపురంలోని ఎర్రితాత స్వామి ఆలయంలో నిద్ర చేసేందుకు శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. అలా పెద్దకొకుంట్ల సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొంది. దీంతో దంపతులు పక్కనే ఉన్న హంద్రీ-నీవా కాలువలోకి ఎగిరిపడ్డారు. నీటి ప్రవాహంలో మాణిక్యమ్మ కొట్టుకుపోయింది. భర్త కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. లాలుస్వామి అతికష్టం మీద ఈదుకుంటూ బయటకు వచ్చి స్థానికుల సహాయంతో కాలువలో పొడవునా గాలింపు చేపట్టారు. ఎక్కడా ఆమె జాడ కనిపించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఉదయం కాలువలో గాలింపు చేపట్టగా ప్రమాదం జరిగిన స్థలం నుంచి కిలో మీటరు దూరంలో ముళ్లకంపల్లో మాణిక్యమ్మ మృతదేహాన్ని గుర్తించి బయటకు తెచ్చారు.

ప్రయాణికురాలిపై చేయిచేసుకున్న డ్రైవర్

- బహిరంగ క్షమాపణతో సద్దుమణిగిన వివాదం

గుత్తి: బస్సులోకి నెమ్మదిగా ఎక్కుతున్న ప్రయాణికురాలిపై ఆర్టీసీ డ్రైవర్ చేయి చేసుకున్నాడు. తర్వాత బాధితురాలి కుటుంబ సభ్యుల ఆందోళనతో డ్రైవర్ బహిరంగ క్షమాపణ చెప్పాడు. వివరాలిలా ఉన్నాయి. గుత్తి పట్టణంలోని కమాటం వీధికి చెందిన షరీఫాబీ అనే వృద్ధురాలు తన కుమార్తెను వెంటబెట్టుకుని డోన్‌కు వెళ్లింది. అక్కడి నుంచి తిరిగి గుత్తికి రావడానికి ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కబోయింది. త్వరగా ఎక్కండంటూ డ్రైవర్ గద్దించాడు. ఆమె కాస్త నెమ్మదిగా ఎక్కుతుండటంతో కోపంలో డ్రైవర్ ఆమెపై చేయి చేసుకున్నాడు. అవమానభారంగా భావించిన షరీఫాబీ ఇక్కడ జరిగిన విషయాన్ని ఫోన్ ద్వారా తన కుమారుడికి సమాచారం చేరవేసింది. కుమారుడు రఫీక్ కమాటం వీధికి చెందిన వారితో కలిసి గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్సు రాగానే కమాటం వీధికి చెందినవారు డ్రైవర్‌పై దాడి చేయడానికి ప్రయత్నించగా రఫీక్ వారించాడు. ఎస్ఐ సురేష్ సమక్షంలో ఆర్టీసీ డ్రైవర్.. వృద్ధురాలు షరీఫాబీకి బహిరంగ క్షమాపణ చెప్పాడు. దీంతో వివాదం సద్దుమణిగింది.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- కొనకొండ్లలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం





సాఫ్ట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సర్పంచు ఇందిరమ్మ, ఎంఈఓలు తదితరులు

వజ్రకరూరు: క్రీడాకారులు అంతర్జాతీయస్థాయికి ఎదగాలని వక్తలు పిలుపునిచ్చారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. కొనకొండ్ల గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్రస్థాయి 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్- 17 బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొదట జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎం ఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, హెచ్ఎం వేణుగోపాల్ తదితరులు జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల నుంచి వారు గౌరవ వందనం స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులను ఘనంగా సత్కరించారు. తొలిరోజు విశాఖపట్నం - ప్రకాశం, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా- ఈస్ట్ గోదావరి జిల్లా జట్ల మధ్య పోటీలు జరిగాయి. వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచడంతోపాటు మానసికోల్లాసం కలిగిస్తాయన్నారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి మంచిపేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్ శ్రీకాంత్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రెటరీ సుగుణమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, కళా సుధాకర్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సురేష్, గుంతకల్లు పట్టణ వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా టీం లీడర్ మేనేజర్స్, టోర్నమెంట్ నిర్వహణ సహాయకులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘంనాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవిత క్షమాపణ చెప్పాలి

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

అనంతపురం కార్పొరేషన్: మహిళలను కించపరిచేలా మాట్లాడిన మంత్రి సవిత బేషరతుగా క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి డిమాండ్ చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల శాసన మండలిలో మంత్రి సవిత వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్వయం సహాయక సంఘాలకు స్వయం ఉపాధి కల్పించకుండా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేయడం ద్వారా మహిళలు మత్తు, గంజాయికి అలవాటుపడ్డారని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. మంత్రి సవిత ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీసత్యసాయి జిల్లాలో రెండు లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలు ఆర్థిక పురోగతి సాధించేందుకు ప్రతి పథకంలోనూ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భాగస్వాములను చేయడంతో పాటు రూ.లక్షల్లో రుణాలు ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణ మాఫీ చేశారని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు భారతి, శోభారాణి, కమర్తాజ్, దేశాయ్ భారతిరెడ్డి, అంజలి, ప్రసన్నలక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

- ప్రభుత్వ లాంఛనాలతో కొనకొండ్లలో అంత్యక్రియలు



ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

వజ్రకరూరు: సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ బి.రమేష్ (40) అనారోగ్యంతో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కొనకొండ్లకు చెందిన రమేష్ మూడో బెటాలియన్ హైదరాబాద్‌లో 2004 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30న అక్కడే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. శుక్రవారం సాయంత్రం పరిస్థితి విషమించి చనిపోయారు. మృతదేహాన్ని అక్కడి నుంచి స్వగ్రామం కొనకొండ్లకు తీసుకొచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ మృతికి ఎస్పీ జగదీష్ సంతాపం తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ ఉత్తర్వుల మేరకు ఉరవకొండ రూరల్ సీఐ చిన్నగౌస్, వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి, సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్ఐ నాగస్వామి, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి.కృష్ణయ్య తదితరులు పాడెమోసి నివాళులర్పించారు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పొత్తిళ్లలోని బిడ్డకు అమ్మ దూరం!



మృతి చెందిన శారద

బత్తలపల్లి: కాన్పు నిమిత్తం ఆస్పత్రిలో చేరిన నిండు గర్భిణి.. బిడ్డకు జన్మనిచ్చి కానరాని లోకాలకు వెళ్లిపోయింది. ఇంకా కళ్లుకూడా తెరవని పసికందు మాతృప్రేమకు దూరమైంది. ఈ ఘటన శనివారం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన సమాచారం మేరకు... బెళుగుప్పకు చెందిన ఆంజనేయులు భార్య శారద(27)కు నెలలు నిండడంతో కాన్పు నిమిత్తం ఈనెల 20వ తేదీన ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకువచ్చి అడ్మిట్ చేశారు. శనివారం శారదకు ప్రసవ నొప్పులు రావడంతో వైద్యులు కాన్పుల వార్డుకు తీసుకువెళ్లారు. అయితే నార్మల్ డెలివరీ కావాలంటే కొద్దిసేపు నడవాలని సూచించారు. నొప్పులు తట్టుకోలేని శారద తనకు సిజేరియన్ చేయాలని కోరింది. అయినా వైద్యులు సాధారణ ప్రసవం చేయాలని ప్రయత్నించారు. ఈ క్రమంలో తీవ్ర ఆందోళనకు గురైన శారద బిడ్డకు జన్మనిచ్చి గుండెపోటుతో మృతి చెందింది. తొలుత బిడ్డను కుటుంబీకులకు చూపిన వైద్యులు...శారద ఆరోగ్యం బాగోలేదని...చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ఆమె మృతి చెందిందని తెలిపారని శారద భర్త ఆంజనేయులు తెలిపారు. శనివారం రాత్రి శారద మృతదేహాన్ని ఆర్డీటీ అంబులెన్స్‌లో బెళుగుప్పకు తరలించారు.

క్లుప్తంగా

పక్కాగా ఓటరు నమోదు


బీఎల్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ విజయ కుమారి

రాప్తాడు: ఓటరు నమోదు కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ విజయ కుమారి సూచించారు. శనివారం మండలంలోని 16 పంచాయతీ గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమం నిర్వహించారు. రాప్తాడు, ప్రసన్నాయపల్లి, బొమ్మేపర్తి, అయ్యవారిపల్లి, రామినేపల్లి తదితర గ్రామాల్లో జరిగే ఓటర్ నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వయస్సు నిర్ధారణ పత్రాలు అందజేసి పరిశీలించి సంబంధిత పత్రాల్లో నమోదు చేయాలన్నారు. తప్పులను సరిచేసి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈడీటీ సువర్ణ, ఆర్‌ఐ కరుణాకర్, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు జీవితం చిత్తు


విద్యార్థులను పరీక్షిస్తున్న ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ తిరుపతి నాయుడు

అనంతపురం మెడికల్: మాదక ద్రవ్యాలతో జీవితం చిత్తు అవుతుంది. విద్యార్థి దశ నుంచి మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సీనియర్ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు పేర్కొన్నారు. శనివారం పాతూరులోని నంబర్–2 పాఠశాలలో మాదక ద్రవ్యాల అనర్థాలపై వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, మార్ఫిన్, గుట్కా తదితర మాదక ద్రవ్యాల దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, హోమియో మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి, ఆయుష్ ఫార్మసిస్టు సుదర్శన్ రెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం నవీద, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. జిల్లాలో చైతన్య, నారాయణ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్య వ్యాపారం ప్రారంభించాయన్నారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయక ముందే ఇంటర్‌లో తమ కళాశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. ముందుగా బుక్ చేసుకుంటే ఫీజు రాయితీ కల్పిస్తామంటూ ఆశలు పెడుతున్నారన్నారు. ముందస్తు అడ్మిషన్లకు సహకరించని విద్యార్థులు, తల్లిదండ్రులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఆయా పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి మాట్లాడితే అధికారులకు తెలుస్తుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కళాశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. డీఈఓ, ఆర్‌ఐఓ నిద్రమత్తు వీడాలన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వైటీసీ రమేష్, వంశీ, తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, నాయకులు సూర్య ప్రకాష్, రజిత, బీమేష్, గణేష్ పాల్గొన్నారు.

నేడు జాతీయ శతాధిక కవి సమ్మేళనం

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కవి సమ్మేళనం ప్రతినిధి గంధం అశోక్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సీనియర్ రచయితలు, కవులతో పాటూ పలు రాష్ట్రాల నుంచి కూడా కవులు, రచయితలు, సాహితీవేత్తలు కవిసమ్మేళనంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు

- బరి తెగిస్తున్న అక్రమార్కులు
- అనుమతి లేకుండా చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు


రాప్తాడు నుంచి అక్రమంగా తరలుతున్న కలప


మరూరు నుంచి అనంతపురానికి కలపను తరలిస్తున్న దృశ్యం

రాప్తాడు: చెట్లు మానవాళికి ఆయువు పట్టు. అటువంటి వాటిని అక్రమార్కులు ఆధునిక యంత్రాలతో ఒక నిమిషంలో కూలదోస్తున్నారు. నిన్నటి వరకు చల్లని గాలి, నీడ ఇచ్చిన వృక్షాలు తెల్లవారేసరికి మోడులా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా పచ్చదనం కనుమరుగవుతోంది. అక్రమార్కులకు మాత్రం కాసుల వర్షం కురుస్తోంది. మండలంలో రెవెన్యూ, పోలీస్, అటవీ అధికారుల నిర్లక్ష్యంతో పచ్చని చెట్లు, ఫలసాయం ఇచ్చే వృక్షాలు కనుమరుగవుతున్నాయి. భారీ వృక్షాలను నరికేస్తూ సరిహద్దులు దాటిస్తున్నారు. రాప్తాడు మండలంలో కలప అక్రమ రవాణకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. మండలంలోని రైతుల నుంచి కొందరు కలప వ్యాపారులు చెట్లను చౌకగా కొనుగోలు చేసి, గుట్టు చప్పుడు కాకుండా నరికి రాత్రి పూట కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అలాగే సమీప అటవీ ప్రాంతాల్లోని చెట్లను కూడా నరికివేస్తున్నారు. చింత, కానుగ, వేప చెట్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. గృహోపకరణాలు, వంట చెరుకుగా వినియోగిస్తున్నారు. కలపను ఇటుక బట్టీలు, హోటళ్లకు అధికంగా తరలిస్తున్నారు. రోజుకు సుమారు 20 నుంచి 40 టన్నుల వరకు రాత్రి పూట అక్రమంగా తరలుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. సరిహద్దు ప్రాంతాల్లో అయితే పట్టపగలే కలప అక్రమ రవాణా జరుగుతోందని ప్రజలు చెబుతున్నారు. సమాచారం అందినా అధికారులు మౌనంగా ఉంటుండటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అటకెక్కినా వాల్టా..

అనుమతి లేకుండా చెట్లు నరికినా, బోర్లు వేసినా వాల్టా చట్టం కింద కేసు నమోదు చేయాలి. పోలీసు, రెవెన్యూ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు. దీంతో వాల్టా చట్టం అటకెక్కింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా చెట్లను నరికివేస్తున్నారు. రాప్తాడు మండలంలో పాలబావి, ఎం.బండమీదపల్లి, పాలచెర్ల, బోగినేపల్లి, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు, గాండ్లపర్తి, జి.కొత్తపల్లి, బుక్కచెర్ల తదితర గ్రామాల్లో పచ్చని చెట్లు కనుమరుగవుతున్నాయి. చెట్లను నరికేస్తూ అక్రమంగా కలపను రవాణా చేస్తున్నారు.

అక్రమ రవాణాను అరికడతాం



రాప్తాడు మండలం నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా కలప రవాణా జరుగుతుందని ఇప్పటి వరకు నా దృష్టికి రాలేదు. తక్షణమే రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేస్తాం. అక్రమ కలప రవాణాను అరికడతాం. అవసరమైతే వాల్టా చట్టాన్ని అమలు చేస్తాం. అలాగే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రజలు రెవెన్యూ అధికారులకు సహకరించాలి.

– పి.విజయ కుమారి, తహసీల్దార్, రాప్తాడు

'ఏక్ భారత్–శ్రేష్ట భారత్'కు ఐదుగురి ఎంపిక


విద్యార్థులతో ఆర్జేడీ నాగలింగారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ

అనంతపురం ఎడ్యుకేషన్: స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విజయవాడ వారు నిర్వహిస్తున్న 'ఏక్ భారత్–శ్రేష్ట భారత్' (యువ సంఘం ఫేజ్–5) కార్యక్రమానికి స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఒకే కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడం గర్వకారణమని కళాశాల విద్య ఆర్జేడీ నాగలింగారెడ్డి తెలిపారు. ఈ వివరాలను శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ వెల్లడించారు. ఫైనలియర్ విద్యార్థులు బి.అభిషేక్ నాయక్, పొట్టేటి యల్లమంద, భవ్య, చెన్నకేశవరెడ్డి, గీత ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు ప్రయోగలోని ఐఐటీ అలహాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 'ఏక్ భారత్–శ్రేష్ట భారత్' లో విద్యార్థులు 'పర్యటన', 'సంప్రదాయాలు', 'ప్రగతి', 'పరస్పర మానవ సంబంధాలు' పెంచుకోవడం, 'సాంకేతికత' లాంటి అంశాలను క్షుణ్ణంగా తెలుసుకుంటారన్నారు. యువ సంఘం వల్ల దేశ వ్యాప్తంగా యువత పరస్పర రాష్ట్రాలతో సంబంధాలు పెంచుకోవడం వల్ల భిన్నత్వంలో ఏకత్వం, ఐకమత్యం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 2 సార్లు ఈ అవకాశం కల్పిస్తోందని ఎన్ఎస్ఎస్ పీఓ విష్ణుప్రియ తెలియజేశారు. అధ్యాపకులు రామకష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

తపోవనం జట్టుకు భారీ విజయం

- కొనసాగుతున్న రూరల్ క్రికెట్ లీగ్ టోర్నీ



తన్మయి కార్తీక్ (సెంచరీ) జి.కౌశిక్ (సెంచరీ)

అనంతపురం: ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న రూరల్ క్రికెట్ లీగ్ 2024–25 కొనసాగుతోంది. శనివారం అనంతపురం ఆర్డీటీ గ్రౌండ్‌లో తపోవనం క్రికెట్ అకాడమీ – పెనుకొండ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తపోవనం జట్టు 40 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి గాను 398 పరుగులు చేసింది. జట్టులో జి.కౌశిక్ (108), యు.తన్మయి కార్తీక్ రెడ్డి (101) సెంచరీలతో చెలరేగారు. అనంతరం పెనుకొండ జట్టు 67 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో తపోవనం జట్టు భారీ విజయం నమోదు చేసింది.

- ఆర్డీటీ హాకీ గ్రౌండ్‌లో కదిరి –ఏఎస్ఏ (అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత కదిరి జట్టు బ్యాటింగ్ చేసి నాలుగు వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ జట్టు 118 పరుగులకే ఆలౌట్ అయి ఓటమి పాలైంది. కదిరి జట్టు విజయదుందుభి మోగించింది.
- విన్సెంట్ గ్రౌండ్‌లో గుంతకల్లు రైల్వే, ఎస్ఎస్‌బీఎన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుంతకల్లు రైల్వే జట్టు పది వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్ఎస్‌బీఎన్ జట్టు 122 పరుగులకు ఆలౌట్ అయింది. 42 పరుగులతో గుంతకల్లు రైల్వే జట్టు విజయం సాధించింది.
- మడకశిరతో జరిగిన మరో మ్యాచ్‌లో గుత్తి జట్టు 42 పరుగుల తేడాతో గెలుపొందింది.
- రాప్తాడుతో జరిగిన మ్యాచ్‌లో ఆత్మకూరు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.
- బుక్కరాయసముద్రంతో జరిగిన మ్యాచ్‌లో నార్పల జట్టు ఒక వికెట్ నష్టానికి 335 పరుగులు చేసింది. తేజశ్రీ శర్మ 173 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. భారీ విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన బుక్కరాయసముద్రం జట్టు 34 పరుగులకే కుప్పకూలింది. 301 పరుగుల తేడాతో నార్పల ఘన విజయాన్ని సాధించింది.

అనంతపురం జిల్లా కెప్టెన్‌గా మచ్చా దత్తారెడ్డి


జట్టులో స్థానం సంపాదించుకున్న క్రికెటర్లు

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 30 వరకు కడపలో అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ (అండర్–23 మెన్) నిర్వహించనున్నారు. ఇందులో ప్రాతినిధ్యం వహించే అనంతపురం జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.భీమలింగారెడ్డి తెలిపారు. కెప్టెన్‌గా మచ్చా కె.దత్తారెడ్డి, సభ్యులుగా పి.అర్జున్ టెండూల్కర్, కేహెచ్ వీరారెడ్డి, బి.యోగానంద, ఎం.దీపక్, ఎస్.మనోజ్ కుమార్, జి.మల్లికార్జున, ఎం.కె.లోహిత్ సాయి కిషోర్, టి.ప్రదీప్‌రెడ్డి, బి.ప్రశాంత్, ఎం.జై కృష్ణ, కె.ప్రమోద్, డి.ఖాదర్ వలి, రోహిత్ రోషన్, జె.లీలాసాయి, టి.మహేంద్రరెడ్డి ఎంపికయ్యారు. కోచ్‌గా కె.నరేష్ వ్యవహరించనున్నారు.

ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమంత రావు

అనంతపురం ఎడ్యుకేషన్: మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనంతపురం నగరానికి చెందిన ఎ.హనుమంతరావును నియమించారు. ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు సూచన మేరకు జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ శనివారం నియామకపత్రం అందజేశారు. హనుమంతరావు వజ్రకరూరు మండలం పీసీపీ కొత్తకోట ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచరుగా పని చేస్తున్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాల్లో విద్యార్థి దశ నుంచే క్రియాశీలకంగా పని చేశారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగుతున్న పోరాటాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. గతంలో ఎంఈఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, అదనపు ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఇందుకు ఎంఈఎఫ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బండారు శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాప్తాడు రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆత్మకూరు మండలం యాలేరుకు చెందిన ఓ యువకుడు కర్నూలులో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాలేరు గ్రామానికి చెందిన జీవన్‌కుమార్ (19), అతడి స్నేహితుడు రవితో కలిసి గతనెల 12న అనంతపురం నగరం నుంచి యాలేరుకు బైకులో వెళ్తున్నారు. మార్గ మధ్యంలో అనంతపురం రూరల్ పరిధిలోని ఎస్ఎల్ఎన్ కళాశాల సమీపంలోకి వెళ్లగానే బైకు అదుపుతప్పి పక్కనే వెళ్తున్న మరో బైకును ఢీకొట్టి కిందకు పడ్డారు. ఈ ప్రమాదంలో జీవన్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన అతడిని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా అంధుల అథ్లెటిక్స్ పోటీలు


రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారులు

అనంతపురం: అనంతపురం ఆర్డీటీ మైదానంలో అంధుల మూడవ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలను శనివారం అంధుల జాతీయ క్రీడా సంఘం కార్యదర్శి డేవిడ్ ప్రారంభించారు. అంధ క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారు డిసెంబర్ 13 నుంచి 17 వరకు గుజరాత్ రాష్ట్రం వడోదరలో జరిగే జాతీయస్థాయి అంధుల అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అంధుల క్రీడా సంఘం అధ్యక్షుడు కె.వెంకటరమణ, ఏపీ అంధుల క్రీడా సంఘం కార్యదర్శి ఆర్.రఘుకుమార్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కోచ్ కె.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి


ఆత్మకూరులో అన్నదానం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని సత్యసాయి తాగు నీటి సరఫరా కార్యాలయంలో శనివారం సత్యసాయి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి నీటి సరఫరా కార్మికులు సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి అర్చకులతో పూజలు చేయించారు. అన్నదానం చేపట్టారు.

బాబా జీవితం మానవాళికి సందేశం

అనంతపురం కల్చరల్: సత్యసాయిబాబా జీవితమే మానవాళికి దివ్య సందేశమని డీఆర్‌ఓ మలోల అన్నారు. సాయిట్రస్టు ఆధ్వర్యంలో బాబా 99వ జయంతి సందర్భంగా సంవత్సరం పాటూ సాగే శతాధిక సేవా కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్, సత్యసాయి సంస్థ కన్వీనర్ రఘునాథ్, రాఘవేంద్ర, నాయక్ పాల్గొన్నారు.

వందశాతం లక్ష్యాలు సాధించాలి


సమీక్ష నిర్వహిస్తున్న మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ సి.రామాంజనేయులు

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని అన్ని కమిటీలు వందశాతం సాధించాలని ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజనేయులు ఆదేశించారు. శనివారం అనంతపురంలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎన్ మూర్తితో కలిసి 17 మార్కెట్ కమిటీల సెక్రెటరీలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్ పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.12.06 కోట్లు లక్ష్యం కాగా.. గడిచిన ఏడు నెలలకు గాను 46 శాతంతో రూ.5.54 కోట్లు వసూలైందన్నారు. గతేడాది కన్నా ఈసారి రూ.78 లక్షల వరకు ఆదాయం తగ్గిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతపురం, శింగనమల, తాడిపత్రి కమిటీల పరిస్థితి బాగానే ఉన్నా మిగతా వాటిల్లో పురోగతి లేదన్నారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఉన్న 8 మార్కెట్ కమిటీలు, 16 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.5.31 కోట్లు టార్గెట్ కాగా ఇప్పటి వరకు 53 శాతంతో రూ.2.81 కోట్లు వసూలు చేశారని తెలిపారు. ఇక్కడ కూడా గతేడాది కన్నా రూ.7 లక్షల వరకు తక్కువగా ఉందన్నారు. విజిలెన్స్ బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టులు, మార్కెట్‌యార్డుల్లో నిఘా పెంచాలన్నారు. పశువులు, జీవాలు, చీనీ, చింత, మిరప తదితర క్రయ విక్రయాల్లో లీకేజీలను పూర్తిగా అరికడితే అనుకున్న ఫలితాలు వస్తాయని తెలిపారు.

ఆకట్టుకున్న వంటల పోటీలు



తయారు చేసిన వంటలను ప్రదర్శిస్తున్న మహిళలు, ప్రశంసాపత్రాలను చూపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అనంతపురం కల్చరల్: స్థానిక పీస్ మెమోరియల్ హాలులో శనివారం ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పర్యాటక, పురావస్తు శాఖలు, ఇంటాక్ సంస్థ సంయుక్తంగా మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. ఇన్నర్‌వీల్, ఐసీడీఎస్ తరఫున అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు రుచికరమైన వంటలతో పాటు సంప్రదాయంగా వస్తున్న ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. రాగి పన్నీర్ క్యారెట్ పరోట చేసిన చందనకు ప్రథమ బహుమతి, కొర్రల కరివేపాకు పొడిచేసిన అనితకు రెండవ బహుమతితో పాటూ అందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇంటాక్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రపంచ వారసత్వ వారోత్సవాల ముగింపు వేడుకలు ఆదివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మ్యూజియం ఏడీ రజిత, నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు జయంతి, బీసీ వెల్ఫేర్ శాఖ జిల్లా అధికారి కుష్బూకొఠారి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ జిల్లా అధికారి సువర్ణ, జిల్లా విద్యాశాఖాధికారి కల్పన, డీవీఈఓ వెంకట రమణ, కమర్షియల్ టాక్స్ అధికారి శ్రీనివాసులు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నరేంద్ర, ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని 47 అంగన్‌వాడీ కేంద్రాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రపంచ వారసత్వ వారోత్సవాలకు హాజరయ్యారు. ఎలాంటి మందులు వాడని ఆర్గానిక్ వంటలను ప్రదర్శించారు. రుచికరమైన వంటలను వండిన అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక' అలవెన్సులొచ్చాయోచ్!

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు శుభవార్త. ఈ ఏడాది జూన్ నుంచి 2025 మార్చి వరకు పది నెలలకు సంబంధించిన వివిధ అలవెన్సులు మంజూరయ్యాయి. మొత్తం రూ.76 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో రవాణా భత్యం కోసం రూ. 22.50 లక్షలు, ఎస్కార్ట్ అలవెన్స్ కోసం రూ. 19.20 లక్షలు, బాలికల స్టయిఫండ్‌కు రూ. 26.10 లక్షలు, హోంబేస్డ్ ఎడ్యుకేషన్‌కు రూ.9.30 లక్షలు కేటాయించింది. ఈ మేరకు సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 31 భవిత కేంద్రాలు ఉన్నాయి. భవిత కేంద్రాలు, వివిధ పాఠశాలలకు వెళ్తున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు రవాణా భత్యం (ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్) పేరుతో నెలకు రూ. 300 ప్రకారం ఏడాదిలో పదినెలలకు గాను రూ.3 వేలు మంజూరు చేస్తోంది. పిల్లలకు తోడుగా వచ్చేవారికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఎస్కార్ట్ అలవెన్స్ కింద నెలకు రూ.300 ప్రకారం పది నెలలకు రూ. 3 వేలు ఇస్తోంది. బాలికలకు స్టయిఫండ్ నెలకు రూ. 200 ప్రకారం 10 నెలలకు రూ. 2 వేలు ఇస్తోంది. హోంబేస్డ్ ఎడ్యుకేషన్ అందుకుంటున్న పిల్లలకు నెలకు రూ. 300 ప్రకారం ఏడాదికి పదినెలలు రూ. 3 వేలు చెల్లిస్తోంది. రెండుమూడు రోజుల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో అలవెన్సులు జమ చేయనున్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం

అనంతపురం క్రైం: ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పని చేయాలని ఆర్టీసీ కడప జోన్ జోనల్ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. శనివారం ఉమ్మడి జిల్లా ఆర్టీసీ అధికారులు, డిపో మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఆర్టీసీ సౌకర్యాలు, ప్రయాణిస్తున్న దూరంతో పాటు ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమన్వయంతో ముందుకు వెళదామన్నారు. బస్టాండ్‌లో సౌకర్యాలు మెరుగు పరచాలన్నారు. మహిళల మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వం తరఫున మనం చేయాల్సిన ప్రత్యేక అనుమతులుంటే అధిష్టానంతో మాట్లాడి వాటిని పరిష్కరించుకునేందుకు కృషి చేద్దామన్నారు. ప్రతి ఆర్టీసీ డ్రైవరు, కండక్టర్ ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలిగేలా డిపో మేనేజర్లు ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలన్నారు. బస్సులను కండీషన్‌లో ఉంచి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్.ఆదోని, శ్రీసత్యసాయి జిల్లా డీపీటీఓ మధుసూదన్ తదిరులు పూల నాగరాజును పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఓ శ్రీలక్ష్మి, డిప్యూటీ సీఎంఈ రమేష్, డీఈఈ సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఇళ్లు మంజూరు చేయాలి

అనంతపురం టౌన్: ఎస్సీ, ఎస్టీలకు ఇళ్లు మంజూరు చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణ పనుల్లో దళిత, గిరిజనులకు ఎదురవుతున్న అడ్డంకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం హౌసింగ్ పీడీ శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలకు మంజూరు చేసిన ఇంటి నిర్మాణాలకు సంబంధించి సకాలంలో బిల్లులు, సామగ్రి అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఇళ్ల నిర్మాణ పనులను హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి క్రమ పద్ధతిలో బిల్లులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాసులు, రామకృష్ణ, వెంకటేశు, దిలీప్, ఆదినారాయణ, మారెన్న, ఈశ్వరయ్య, గోపాల్ పాల్గొన్నారు.

వృథా చేస్తే కన్నీరే..


పైప్‌లైన్ పగిలిపోవడంతో లీకేజీ అవుతున్న నీరు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని సిద్దరాంపురం గ్రామానికి వెళ్లే రహదారిలో బీసీ హాస్టల్ పక్కన ప్రజలకు తాగునీరు అందించేందుకు రెండు బోర్లు వేయించారు. ఒక బోరు వద్ద పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. మరో బోరు దగ్గర ట్యాబ్ కనెక్షన్ పూర్తిగా దెబ్బతినడంతో నీరు లీకేజీ అవుతోంది. అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

In the court of the Hon'ble Senior Civil Judge, Anantapuramu

E.P. No: 81/2022 in O.S. No: 160/2008

Between :

M/s Margadarsi Chit Fund Pvt Ltd., Proddutur. Rep. by its Manager cum foreman ...D.Hr.

and

K. Durga Prasad and Others ...J.Drs.

J.Dr 1, 3 and 4 కి Order 21 Rule 37 CPC నోటీసు

J.Dr.01: Kotta Durga Prasad, S/o. K.Satya Narayana, Flat D.No: 5/418, Anantapur Town and District.

J.Dr.03: Patan Rahamthulla, S/o. P. Mahaboob Khan, R/of D.No: 10-205, Adimurthy Nagar, Anantapur.

J.Dr.04: Maliyala Kurava Ayyanna, S/o. M.K. Narasappa, R/at present Resident of D.No. 1-2-329, R.K. Nagar, Anantapur.

పిటీషనరు బాకీ మొత్తం రాబట్టుకొనుటకు గాను మీపై దాఖలు చేసిన E.P లో 1,3,4 వ J.Drs అయిన మీరు **05-12-2024**వ తేదీన హాజరగుటకు గాను వాయిదా వున్నది. పై దినం **ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట ఖుద్దున మీరు గానీ మీ తరపున వకీలు గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

బోయపాటి రాజశేఖర్, D.Hr. అడ్వకేటు, అనంతపురము Cell: 9440289779